కేంద్ర మంత్రికి శుభాకాంక్షలు



శామీర్‌పేట: కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్‌ను మున్నూరు కాపు సంఘం మేడ్చల్‌ జిల్లా అధ్యక్షుడు మామిండ్ల శ్రీనివాస్‌ ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. కేంద్ర హోంమంత్రిగా బాధ్యతలు చేపట్టిన సందర్భంగా బండి సంజయ్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ఆయన వెంట రాష్ట్ర ఓబీసీ ఉపాధ్యక్షుడు సదానందం, రాజ్‌కుమార్‌, నర్సింగ్‌, నవీన్‌, మున్నూరుకాపు సంఘం సభ్యులు పాల్గొన్నారు.

4న అన్నోజిగూడ బోనాలు



సమావేశంలో పాల్గొన్న చైర్మన్‌ కొండల్‌రెడ్డి

పోచారం: మున్సిపాలిటీ పరిధిలోని అన్నోజిగూడలో ఆగస్టు 4వ తేదీన బోనాల జాతర నిర్వహించాలని గ్రామ పెద్దలు నిర్ణయించారు. ఆదివారం అన్నోజిగూడలోని అయ్యప్ప స్వామి ఆలయం వద్ద నిర్వహించిన సమావేశంలో గ్రామ పెద్దలు ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. సమావేశంలో చైర్మన్‌ కొండల్‌రెడ్డి, వైస్‌ చైర్మన్‌ రెడ్యానాయక్‌, కౌన్సిలర్లు రాజశేఖర్‌, సాయిరెడ్డి, నాయకులు శంకర్‌గౌడ్‌, బాల్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక పూజలు

గౌతంనగర్: వారాహి నవరాత్రుల సందర్భంగా గౌతంనగర్‌ డివిజన్‌ ఉత్తమ్‌నగర్‌లోని శ్రీదుర్గా జ్యోతిష్యాలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆదివారం ఉదయం మూలమంత్ర హోమం, ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు నిర్వాహకులు నాగరాజుశర్మ ప్రకటించారు. కాలనీవాసులు, భక్తులు పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో 'బయో మెట్రిక్‌' హాజరు!

- ఈ నెలాఖరు లేదా ఆగస్టు నుంచి అమల్లోకి
- జీప్లస్‌ టూ పద్ధతిలో నిర్మించిన కలెక్టరేట్లో 86 గదులు
- విధుల నిర్వహణలో వివిధ శాఖలకు చెందిన దాదాపు 400 మంది ఉద్యోగులు
- నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి రాక
- సమయం పాలన కోసమే బయోమెట్రిక్‌ విధానం



సాక్షి, సిటీబ్యూరో: మేడ్చల్‌–మల్కాజిగిరి జిల్లా కలెక్టర్‌ కార్యాలయంలో బయోమెట్రిక్‌ హాజరు విధానాన్ని ప్రవేశపెట్టేందుకు జిల్లా అధికార యంత్రాంగం చర్యలు తీసుకుంటోంది. ఈ నెలాఖరు లేదా ఆగస్టు నుంచి ఈ తరహా హాజరు విధానాన్ని అమల్లోకి తెచ్చేందుకు చకచకా ఏర్పాట్లు చేస్తున్నారు.

◆ కలెక్టరేట్‌లోని దాదాపు 50 ప్రభుత్వం శాఖలు, విభాగాలు ఉండటంతో... దానికి తగ్గట్టుగా 6 నుంచి 10 వరకు బయోమెట్రిక్‌ యంత్రాలను ఏర్పాటు చేయటంపై సమాలోచనలు చేస్తున్నారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్‌ గౌతమ్‌ ఆదేశాల నేపథ్యంలో విధివిధానాలు, తీసుకోవాల్సిన చర్యలపై సంబంధిత అధికారులు ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు.

◆ ఉద్యోగులు సమాచారాన్ని సేకరించటంతో పాటు.. పొందుపరిచే విషయాలపై శ్రద్ధ చూపుతున్నారు. ఉద్యోగుల హాజరు శాతాన్ని మెరుగు పరచటంతోపాటు విధుల నిర్వహణలో పారదర్శకతను పెంపొందించేందించటం ద్వారా వివిధ ప్రభుత్వ శాఖల పరిపాలనను గాడిలో పెట్టేందుకు అధికార యంత్రాంగం ఈ కీలక నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది.

శాఖలకు కేంద్రం.. కలెక్టరేట్‌...

మేడ్చల్‌–మల్కాజిగిరి జిల్లా కలెక్టర్‌ సమీకృత కార్యాలయం ప్రభుత్వ పాలనకు కేంద్ర బిందువుగా ఉండటంతో అధికారులు, ఉద్యోగులు సమయపాలన పాటించేలా బయోమెట్రిక్‌ విధానాన్ని అమలు చేయనున్నారు. వివిధ శాఖల్లో ఉన్న ఉద్యోగుల సంఖ్యను బట్టి 6 నుంచి 10 బయోమెట్రిక్‌ మిషన్లను ఏర్పాటు చేసేందుకు కసరత్తు చేస్తున్నారు.

◆ ఇక మీదట కలెక్టరేట్లోని వివిధ శాఖలు, విభాగాల్లో పని చేస్తున్న ఉద్యోగులు, అధికారులు, సిబ్బంది పనిదినాల్లో ప్రతి రోజూ ఉదయం 10.30 గంటలకు కార్యాలయానికి చేరుకోవాల్సి ఉంటోంది. సాయంత్రం 5 గంటల వరకు విధులు నిర్వర్తించాల్సి ఉంటోంది.

◆ శామీర్‌పేట మండలం తూముకుంట మున్సిపాలిటీ పరిధిలోని అంతాయిపల్లిలోని మేడ్చల్‌–మల్కాజిగిరి జిల్లా కలెక్టర్‌ కార్యాలయం జీ ప్లస్‌ టూ అంతస్తుల్లో కొనసాగుతోంది. ఇందులో దాదాపు 50 ప్రభుత్వ శాఖలు ఉండగా, 86 గదులు ఉన్నాయి.

◆ జిల్లా కలెక్టర్‌తోసహా ఇద్దరు జిల్లా అదనపు కలెక్టర్లు, డీఆర్వో, వివిధ శాఖ జిల్లా అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది, పర్మనెంట్‌, కాంట్రాక్టు, ఔట్‌ సోర్సింగ్‌ సిబ్బంది మొత్తం కలిపి దాదాపు 400 మంది పని చేస్తున్నారు. ఇక మీదట వీరి హాజరు విధానాన్ని బయోమెట్రిక్‌ పద్ధతిలో అమలు కానుంది.

ఉద్యోగుల వివరాలన్నీ..

కలెక్టరేట్‌లోని వివిధ జిల్లా శాఖల్లో పని చేస్తున్న ఉద్యోగుల వివరాలను బయోమెట్రిక్‌ మిషన్లలో నమోదు చేయాల్సి ఉంటోంది. దీంతో ఉద్యోగులు నిత్యం తమ వేలి ముద్రతో హాజరు వేయాల్సి ఉంటుంది.

◆ ఈ విధానం ఏళ్లుగా అమలులో ఉన్నప్పటికీ, ఆచరణకు నోచుకోలేదు. జిల్లా అధికారులు ఫీల్డ్‌ విజిట్‌ పేరుతో తమ కార్యాలయాలకు రావటంలో.. సమయ పాలన పాటించటం లేదని తెలుస్తోంది. కొన్ని సందర్భాల్లో ఆలస్యం అయిందనే నేపంతో అటునుంచి అటుగా ఇళ్లకు వెళ్లి పోతున్నారన్న ఆరోపణలూ ఉన్నాయి. మరికొందరు ఉద్యోగులైతే సమయ పాలన పాటించటంలో నిర్లక్ష్యం వహిస్తున్నట్లు తెలుస్తోంది. ఆఫీసు వేళలను పాటించటంలో కొంత మంది అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్న తీరును పసిగట్టిన జిల్లా అధికార యంత్రాంగం బయోమెట్రిక్‌ విధానాన్ని ప్రవేశపెట్టేందుకు అస్కారం కల్పించినట్లు తెలుస్తోంది.

కలెక్టరేట్‌లో ఉన్న ఆయా ప్రభుత్వ శాఖల్లో పని చేస్తున్న అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది హాజరుకు సంబంధించి బయోమెట్రిక్‌ విధానం అమల్లోకి రానుండటంతో వెలుపల ఉన్న శాఖల పరిస్థితి ఏమిటనే విషయంపై ఉద్యోగుల్లో చర్చ సాగుతోంది. కలెక్టరేట్

కలెక్టరేట్‌ వెలుపల ఉండే శాఖలివే...

వెలుపల మేడ్చల్‌, మల్కాజిగిరి ఎక్సైజ్‌ సూపరింటెండెంట్‌ కార్యాలయాలు, జిల్లా ఇంటర్మీడియట్‌ అధికారి కార్యాలయం, జిల్లా రిజిస్ట్రార్‌ కార్యాలయం, జిల్లా అటవీ శాఖ కార్యాలయం, జిల్లా రవాణా శాఖ కార్యాలయాలు ఉన్నాయి.

సుదూర ప్రాంతం.. రవాణా వసతి లేకపోవటం...

కలెక్టరేట్లో పనిచేస్తున్న జిల్లా అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది జీహెచ్‌ఎంసీ పరిధితోపాటు రంగారెడ్డి జిల్లా తదితర ప్రాంతాలలో నివాసం ఉండటం వల్ల.. దాదాపు 60 కిలోమీటర్ల నుంచి 10 కిలోమీటర్ల నుంచి రావాల్సి ఉంటోంది. వీరు రోజూ రాకపోకలను కొనసాగించాలంటే సొంత వాహనం ఉంటే తప్ప సమయానికి కలెక్టరేట్‌కు చేరుకోలేని పరిస్థితి నెలకొని ఉంది. పైగా ఆర్టీసీ బస్సు సౌకర్యం అరకొరగా ఉంది. కలెక్టరేట్‌కు బస్సు రోజూ ఉదయం ఒక ట్రిప్పు, సాయంత్రం ఒక ట్రిప్పు మాత్రమే నడుస్తోంది. ఈ బస్సు మిస్సయితే... ఒక ఉద్యోగి రూ. 200 వెచ్చిస్తే తప్ప.. కలెక్టరేట్‌కు చేరుకోలేని పరిస్థితి. అయితే వివిధ శాఖల్లో పని చేస్తున్న పలువురు జిల్లా అధికారులకు వాహనాలు కూడా లేవు. ఒక్కోసారి రాత్రి 8 గంటల వరకూ కొంత మంది అధికారులు, ఉద్యోగులు ఉండాల్సిన పరిస్థితి ఏర్పడుతుండటంతో వారు ఇంటికి వెళ్లాలంటే తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోంది. దీంతో బయోమెట్రిక్‌ అమల్లోకి ముందే.. బస్సు ట్రిప్పుల సంఖ్యను పెంచాలని ఉద్యోగులు కోరుతున్నారు.

జిల్లా అభివృద్ధికి కృషి చేయాలి

ఎంపీ ఈటలను కోరిన జిల్లా సాధన సమితి



ఈటలకు వినతి పత్రమిస్తున్న జిల్లా సాధన సమితి నేతలు

మేడ్చల్: మేడ్చల్‌ జిల్లాను అన్ని రంగాలలో అభివృద్ధి చేసేందుకు మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్‌ ప్రత్యేక శ్రద్ధ వహించాలని మేడ్చల్‌ జిల్లా సాధన సమితి అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి కోరారు. మేడ్చల్‌ జిల్లా సాధన సమితి ఆధ్వర్యంలో ఎంపీ ఈటలను కలిసి వినతి ప్రతం సమర్పించారు. ఉత్తర తెలంగాణకు ముఖ ద్వారంగా ఉన్న మేడ్చల్‌ అభివృద్ధిపై ప్రత్యేకంగా దృష్టి పెట్టాలని కోరారు. మేడ్చల్‌కు ప్రభుత్వ వైద్య కళాశాల, కేజీ టూ పీజీ ఉండేలా ప్రత్యేక యూనివర్సిటీ, స్టేడియం, ఐటీ కారిడార్‌, గృహాలు, జిల్లాలోని మేడ్చల్‌, ఘట్‌కేసర్‌ వరకు మెట్రో రైల్‌ సౌకర్యం కల్పించాలని కోరారు. ఆధ్యాత్మిక కేంద్రమైన కీసరగుట్టను మరింత అభివృద్ధి చేయాలని వినతి పత్రం అందజేశారు.

వేడుకగా బోనాల జాతర



ఎదుగుళ్ల ఆలయానికి బోనాలను తీసుకెళ్తున్న భక్తులు

మేడ్చల్: అషాఢ మాసం ప్రారంభం కావడంతో బోనాల పండగను ఆదివారం మేడ్చల్‌తోపాటు పరిసర ప్రాంతాల్లో ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని ఎడు గుళ్ల ఆలయంలో, పోచమ్మ, ఎల్లమ్మ, మైసమ్మ, ఆలయాలలో బోనాల పండగను చేసుకునే భక్తులు పండగను జరుపుకొన్నారు. బోనాల నేపథ్యంలో అమ్మవారి ఆలయాలను సర్వాంగ సుందరంగా ముస్తాబు చేసి డప్పు చప్పుళ్లతో అమ్మవారిని ఊరేగించి బోనాలను అమ్మవారికి సమర్పించారు. బోనాల పండగ సీజన్‌ రావడంతో గ్రామ దేవతల ఆలయాలను నిర్వాహక కమిటీల వారు నూతనంగా రంగులు వేసి అందంగా ముస్తాబు చేశారు.

దోమల నివారణకు స్పెషల్‌ డ్రైవ్‌



బంధం కుంటలో ఆయిల్‌ బాల్స్‌ వేస్తున్న చైర్మన్‌ కొండల్‌రెడ్డి

పోచారం: మున్సిపాలిటీ పరిధిలోని అన్నోజిగూడలో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఇందులో భాగంగా దోమల నివారణ కోసం ఆయిల్‌ బాల్స్‌ను బంధం కుంటలో చైర్మన్‌ కొండల్‌రెడ్డి వేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... దోమలు, ఈగలు వృద్ధి చెందకుండా ఉండేందుకు పరసరాల్లో నీరు నిల్వ లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో నాయకులు నల్లవెళ్లి శేఖర్‌, శ్రీనివాస్‌ యాదవ్‌, కిషన్‌ నాయక్‌, మహేందర్‌ నాయక్‌, మున్సిపల్‌ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మృతురాలి కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం



ఘట్‌కేసర్: జిల్లా పరిషత్‌ ఉన్నత పాఠశాల ఎదులాబాద్‌లో 2004–05 పదో తరగతి బ్యాచ్‌ విద్యార్థిని రజని, ఆమె భర్త సైతం మరణించడంతో వారి సంతానం ఎదులాబాద్‌లోని అమ్మమ్మ ఇంటిలో నివాసం ఉంటున్నారు. పేద కుటుంబం కావడంతో వారి ఆర్థిక పరిస్థితిని గమనించి మృతురాలి స్నేహితులు రూ. 50 వేల ఆర్థిక సాయం కుటుంబ సభ్యులకు ఆదివారం అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీ ఉన్నత పాఠశాల 2004–05వ పదో తరగతి బ్యాచ్‌ విద్యార్థులు, స్థానికులు పాల్గొన్నారు.

మేడ్చల్‌లో తాగునీటి సమస్యను పరిష్కరించండి



ఎంపీ ఈటలకు సమస్యను వివరిస్తున్న బీజేపీ నాయకులు

మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్‌ వినతి

మేడ్చల్: మేడ్చల్‌ మున్సిపాలిటీ పరిధిలోని 23 వార్డులలో తాగు నీటికి సమస్య లేకుండా చూడాలని పట్టణ బీజేపీ నాయకులు మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్‌ను కోరారు. ఈ మేరకు పట్టణ బీజేపీ నాయకులు ఎంపీ ఈటల నివాసానికి వెళ్లి ఆయనతో సమావేశమయ్యారు. పట్టణంలో తాగునీటి సమస్యను ఆయనకు విన్నవించారు. వార్డులలో నూతనంగా వెలిసిన కాలనీలు, పలు పాత కాలనీలలో పైప్‌లైన్‌ నిర్మాణం లేక ఇంటింటికీ నీరు సరఫరా కావడం లేదని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. మేడ్చల్‌ పట్టణం శరవేగంగా అభివృద్ధి చెందుతుండటంతో పదుల సంఖ్యలో కాలనీలు వెలుస్తున్నాయని అన్ని కాలనీలకు ఇంటింటికీ నీరు సరఫరా అయ్యేలా చర్యలు చేపట్టాలని కోరారు. స్పందించిన ఎంపీ రాజేందర్‌ మున్సిపల్‌ కమిషనర్‌ నాగిరెడ్డికి ఫోన్‌ చేసి కాలనీలలో మంచినీటి సమస్య తీరడానికి ఎంత బడ్జెట్‌ అవసరమో అడిగి తెలుసుకున్నారు. తగు బడ్జెట్‌ను కేటాయించి సమస్యను పరిష్కరించాలని కమిషనర్‌ను ఆదేశించారు. బీజేపీ నాయకులు ఆంజనేయులు, ప్రేందాస్‌, సుధాకర్‌రెడ్డి, రాఘవరెడ్డి, శ్రీకాంత్‌, రాఘవరెడ్డి, శివకుమార్‌, వంశీ తదితరులు పాల్గొన్నారు.

సన్మానం

కీసర: తెలంగాణ రాష్ట్ర స్పోర్ట్స్‌ అథారిటీ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన యువజన కాంగ్రెస్‌ రాష్ట్ర అధ్యక్షుడు శివసేనారెడ్డిని ఆదివారం దమ్మాయిగూడ మున్సిపల్‌ యువజన కాంగ్రెస్‌ కమిటీ అధ్యక్షుడు సోమేష్‌కుమార్‌ కలిసి ఘనంగా సత్కరించి అభినందనలు తెలియజేశారు. శివసేనారెడ్డి కాంగ్రెస్‌ పార్టీలో మున్ముందు మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని సోమేష్‌కుమార్‌ అభిలషించారు.



మొక్కల పంపిణీ



మొక్కలు పంపిణీ చేస్తున్న కౌన్సిలర్‌ నరసింహస్వామి

మేడ్చల్: పచ్చదనం కోసం ప్రభుత్వం చేపట్టిన వనమహోత్సవం కార్యక్రమంలో ప్రజలు భాగస్వాములు కావాలని కౌన్సిలర్‌ వెంచర్ల నరసింహస్వామి యాదవ్‌ పిలుపునిచ్చారు. ఆదివారం 5వ వార్డులో ఆయన మొక్కలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రతి ఇంటి పరసరాల్లో మొక్కలు నాటి సంరక్షించాలన్నారు. పర్యావరణ పరిరక్షణకు అందరూ తోడ్పడాలన్నారు.

వన భోజనాలతో ప్రజల్లో ఐక్యత



వనభోజనాల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి తదితరులు

కీసర: వన భోజనాలతో ప్రజల్లో ఐక్యత పెరుగుతుందని మాల్కాజ్‌గిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు అన్నారు. ఆదివారం కీసర గుట్ట సమీపంలో మల్కాజ్‌గిరి రాజ్‌పుత్‌ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన వన భోజనాల కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... నగరంలో నివసించే ప్రజలు రోజూ వివిధ పనులతో బిజీగా ఉంటారన్నారు. ప్రకృతి ఒడిలో, చక్కటి వాతవరణంలో కుటుంబాలతో కలిసి వనభోజనాలు చేయడం వల్ల ప్రజలకు ఎంతో ఉల్లాసంగా ఉంటూ ఉత్సహాన్ని కలిగిస్తుందన్నారు. టీపీసీసీ ఉపాధ్యక్షుడు తోటకూర వజ్రేష్‌యాదవ్‌, సీనియర్‌ నేత నక్కా ప్రభాకర్‌గౌడ్‌, కీసర మండలాధ్యక్షుడు కోల కృష్ణాయాదవ్‌, వర్కింగ్‌ ప్రెసిడెంట్‌ రామిడి విజయ్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ సభ్యుడు బెలిదేరమేష్‌ గుప్తా, జూపల్లి రవీందర్‌, తదితరులు పాల్గొన్నారు.

బలహీన వర్గాల ఆశాజ్యోతి అంబేడ్కర్‌

ఘట్‌కేసర్: రాజ్యాంగ నిర్మాత, భారతరత్న డాక్టర్‌ బి.ఆర్‌.అంబేడ్కర్‌ బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి అని మున్సిపల్‌ బుడగ జంగం సంక్షేమ సంఘం కార్యదర్శి నాగులు అన్నారు. అంబేడ్కర్‌ ఆలోచన విధానాలు ప్రజల్లోకి తీసుకెళ్లడానికి ప్రబుద్ధ భారత్‌ ఇంటర్నేషనల్‌ బాధ్యుడు అరుణ్‌కుమార్‌ ఆధ్వర్యంలో ఆదివారం అంబేడ్కర్‌ విగ్రహానికి పూలమాల సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... అంటరానితనం నిర్మూలన కోసం అంబేడ్కర్‌ జీవితాంతం పోరాటం చేశారన్నారు. మహనీయుల జీవిత చరిత్ర తెలుసుకొని వారి ఆశయ సాధన కోసం పోరాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో దాసు, రాందాసు, నర్సింగ్‌రావు, శ్రీనివాస్‌, నర్సింహ్మలు, నర్సింహ్మ, ఆంజనేయులు, శ్రీను, శంకర్‌, రాజేశ్‌కుమార్‌, సత్యం, గంగారాం పాల్గొన్నారు.

ఘట్‌కేసర్‌ ఎస్‌ఐకి సన్మానం



ఎస్‌ఐ ప్రభాకర్‌ను కలిసిన నరేశ్‌, లక్ష్మణ్‌

ఘట్‌కేసర్: మేడిపల్లి పీఎస్‌ నుంచి ఘట్‌కేసర్‌ పోలీస్‌ స్టేషన్‌కు బదిలీపై వచ్చిన ఎస్‌ఐ ప్రభాకర్‌ను పలువురు నాయకులు ఆదివారం కలిశారు. ఈ సందర్భంగా ఆయనను శాలువాతో సత్కరించి అభినందనలు తెలియజేశారు. మాజీ ఉప సర్పంచ్‌ నరేశ్‌, లక్ష్మణ్‌, ఆనంద్‌, ప్రవీణ్‌, ఈశ్వర్‌, సురేశ్‌, భాస్కర్‌గౌడ్‌, వెంకటేశ్‌, శ్రీశైలం, జంగయ్య పాల్గొన్నారు.

నాగారంలో ఇంటింటికీ స్టిక్కరింగ్‌

కీసర: ప్రతి ఆదివారం పది గంటలకు పది నిమిషాలపాటు శ్రమదానం చేయాలని నాగారం మున్సిపల్‌ కమిషనర్‌ రాజేందర్‌ పిలుపునిచ్చారు. ఇందులో భాగంగా ఆదివారం మున్సిపాలిటీలో ఇంటింటికీ స్టిక్కరింగ్‌ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పరిసరాల్లో దోమలు వృద్ధి చెందకుండా ఉండాలంటే నివాస ప్రాంతాల్లో నీటి నిల్వలు ఉండకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఇంటి ఆవరణలో తులసి, లెమన్‌ గ్రాస్‌ మొక్కలను పెంచాలని సూచించారు.

మాదకద్రవ్యం పట్టివేత

అల్వాల్: మచ్చబొల్లారంలో రూ. 2 లక్షల విలువైన మాదకద్రవ్యాన్ని అల్వాల్‌ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రాజస్థాన్‌కు చెందిన అశోక్‌ (25) మచ్చబొల్లారం ధర్మారెడ్డి కాలనీలో నివాసం ఉంటున్నాడు. అతని వద్ద మాదకద్రవ్యాలు ఉన్నట్లు సమాచారం మేరకు పోలీసులు ఆదివారం దాడులు నిర్వహించారు. పోలీసుల దాడుల్లో 2 కిలోల ఓపీఎం మాదకద్రవ్యం లభ్యమైంది. నిందితుడిని అరెస్టు చేసి ఓపీఎంను స్వాధీనం చేసుకున్నారు.

బోనాలను ఘనంగా నిర్వహించాలి

మున్సిపల్‌ చైర్‌ పర్సన్‌ పావనీజంగయ్య



బోనాల నిర్వాహణపై మాట్లాడుతున్న చైర్‌ పర్సన్‌ పావనీజంగయ్య

ఘట్‌కేసర్: ఘట్‌కేసర్‌లో బోనాల జాతరను ఘనంగా నిర్వహించాలని మున్సిపల్‌ చైర్‌ పర్సన్‌ పావనీజంగయ్య అన్నారు. మున్సిపల్‌ కార్యాలయ ఆవరణలో బోనాల నిర్వాహణపై గ్రామ పెద్దలు, కుల సంఘాల నాయకులతో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్‌ పర్సన్‌ మాట్లాడుతూ... బాలాజీనగర్‌లోని మూడు గుడల అమ్మవార్ల ఆలయం, అంబేడ్కర్‌ నగర్‌లోని బంగారు మైసమ్మ ఆలయం పనులు నిర్మాణంలో ఉన్నందున ఆగస్టు 18న బోనాల పండగను ఘనంగా చేయాలని నిర్ణయించారన్నారు. సమావేశంలో కౌన్సిలర్‌ రమాదేవి, అంజిరెడ్డి, యాదగిరియాదవ్‌, జంగయ్య యాదవ్‌, రాధాకృష్ణ ముదిరాజ్‌, ఆంజనేయులు యాదవ్‌, రామకృష్ణ యాదవ్‌, చిత్తారి యాదవ్‌, రాంరెడ్డి, రాధాకృష్ణపంతులు, కుల పెద్దలు పాల్గొన్నారు.

ఎన్నికల హామీల అమలులో కాంగ్రెస్‌ విఫలం



కీసర పోలీసులు అరెస్టు చేసిన బీజేపీ నేతలు

కీసర: ఎన్నికల ముందు కాంగ్రెస్‌ పార్టీ ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో పూర్తిగా విఫలమైందని బీజేపీ రాష్ట్ర నేత సింగిరెడ్డి వెంకట్‌రెడ్డి ఆరోపించారు. ఆదివారం హయత్‌నగర్‌ సమీపంలోని అబ్దుల్లాపూర్‌మెట్‌లో సీఎం రేవంత్‌రెడ్డి సభ సందర్భంగా కీసర మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన బీజేపీ నేతలను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేసి కీసర పోలీస్‌ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా సింగిరెడ్డి మాట్లాడుతూ... మేనిఫెస్టోలోని హామీలను అమలు చేయడం చేతకాని కాంగ్రెస్‌ ప్రభుత్వం ప్రజల తరపున నిలబడుతున్న ప్రతిపక్ష నేతలను అక్రమంగా అరెస్టు చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. బీజేపీ నేతలు కొలిచెలిమి కృష్ణ, బొడ శ్రీనివాస్‌రావు, కోల కృష్ణాయాదవ్‌, నల్ల వెంకట్‌రెడ్డి, బండారి శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అ'పూర్వ' సమ్మేళనం



ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న ఘట్‌కేసర్‌ స్కూల్‌ పూర్వ విద్యార్థులు

కీసర: కీసర మండలం చీర్యాల గ్రామంలోని జిల్లా పరిషత్‌ ఉన్నత పాఠశాలకు చెందిన 1998–99వ విద్యా సంవత్సరంలో పదవ తరగతి చదివిన పూర్వ విద్యార్థులు తమ 10వ తరగతి పూర్తయి 25 సంవత్సరాలైన సందర్భంగా ఆదివారం గ్రామంలో ఆత్మీయ సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించారు. చిన్ననాటి మిత్రులంతా ఒక్కచోట చేరి పాఠశాల స్థాయిలోని జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. తమకు విద్యాబుద్ధులు నేర్పించిన ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించి వారి ఆశీర్వచనాలు తీసుకున్నారు. అంతకుముందు పాఠశాల ఆవరణ, స్కూల్‌కు వెళ్లే ప్రధాన రహదారి సమీపంలో 25 మొక్కలను నాటారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ... ప్రతి ఒక్కరూ మొక్కలను నాటి వాటిని సంరక్షించాలని పిలుపునిచ్చారు.

కేశవరం జెడ్పీ హైస్కూల్‌ విద్యార్థులు...

శామీర్‌పేట్: కేశవరం జిల్లా పరిషత్‌ ఉన్నత పాఠశాలలో 2003–04 బ్యాచ్‌ పదో తరగతి చదివిన విద్యార్థుల సమ్మేళనం తూంకుంటలోని అలంకృత రిసార్ట్స్‌లో ఆదివారం ఘనంగా నిర్వహించారు. విద్యా, ఉద్యోగం, వివాహం కారణంగా దూరమైన బాల్య స్నేహితుల క్షేమ సమాచారం అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యాబుద్ధులు నేర్పించిన అప్పటి ఉపాధ్యాయులు స్వర్ణలీల, యాదగిరి స్వామి, సుఖ్‌దేవ్‌, సునిత, నిర్మల, సత్తిరెడ్డి,



పాఠశాల ఆవరణలో మొక్కలు నాటుతున్న పూర్వ విద్యార్థులు

సత్యనారాయణను పూలమాలలు, శాలువాలతో సత్కరించి మెమొంటో అందజేశారు. అనంతరం ఉపాధ్యాయులు ఆశీర్వాదాలు తీసుకున్నారు.

ఘట్‌కేసర్‌లో...

పోచారం: ఘట్‌కేసర్‌లోని జిల్లా పరిషత్‌ బాలుర ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదివిన 1995–96వ బ్యాచ్‌ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం అన్నోజిగూడలోని తులిప్స్‌ హోటల్‌లో ఆదివారం జరిగింది. సుమారు 80 మంది పూర్వ విద్యార్థులు పాల్గొని గత అనుభవాలను పంచుకున్నారు. ఆస్తుల కన్నా విలువైన విద్యను అందించిన గురువులను ఈ సందర్భంగా సత్కరించారు.



గురువులతో కేశవరం జెడ్పీ పాఠశాల పూర్వ విద్యార్థులు